



ఆమ్‌చూర్‌తో ఉపాధి బాట

వేసవిలో రెండు నెలలు నిరంతరాయంగా పని

ఆర్థికంగా లబ్ధిపొందుతున్న పల్లె ప్రజలు

7

ఇద్దరు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

జహీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఇద్దరు అధికారులను కలెక్టర్ సోమవారం సస్పెండ్ చేశారు. మండంలోని కొత్తూరు.బి గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌కు గ్రామ సమీపంలోని సర్వే నంబర్ (7/అ)లో 34 గుంట పట్టా భూమి ఉంది. కొందరు దళారులు ఇటీవల అధికారులను తప్పుదోవ పట్టించి ఆయన మృతిచెందినట్లు ఆధారాలు సృష్టించి ఆ భూమిని వేరే వ్యక్తుల పేరిట ఫౌతీ మార్పిడి చేశారు. విషయం తెలుసుకున్న రైతు తహసీల్దార్ కార్యాలయంలో ఆరా తీయగా పట్టా మార్పిడి జరిగినట్లు రికార్డులో చూపిస్తున్నది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈమేరకు కలెక్టర్ అప్పట్లో ఇక్క నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన పవన్‌కుమార్, జహీరాబాద్ ఆర్ఐ-2 యాదీలాల్‌ను సస్పెండ్ చేశారు.

భూ భారతి చట్టంపై
అవగాహన కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి



హత్నూరలో జరిగిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతితో కలిసి పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి



భూ భారతి చట్టం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని హత్నూర మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నదని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టం రైతులకు వరంగా మారుతోందని స్పష్టం చేశారు. భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు.



వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న హజ్ యాత్రికులు

హజ్ యాత్రికులకు
శిక్షణ, వ్యాక్సినేషన్

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు సోమవారం వ్యాక్సినేషన్, శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా నుంచి 40 మంది హజ్‌యాత్రకు ఎంపిక కాగా.. 27 మంది వ్యాక్సినేషన్‌లో పాల్గొన్నట్లు హజ్ సొసైటీ జిల్లా బాధ్యుడు ఇజాజుద్దీన్ తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మాధురి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సాయి వంశీ, డాక్టర్ అఫ్షా జబీన్, డీడీఎం శ్రీలత, సూపర్‌వైజర్ ఆలీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు గుండెకోత తప్పడం లేదు. ప్రకృతి ప్రకోపానికి చేతికొచ్చిన పంట నేల పాలవుతున్నది. ఈదురుగాలులు, వడగళ్ల బీభత్సానికి పెట్టిన పెట్టుబడి సైతం మట్టిలో కలుస్తోంది. ఇక కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ల కొరత కారణంగా పంటధాన్యం తడిసి ముద్దవుతున్న పరిస్థితి. ఈ పరిణామాలతో దిగాలు చెందుతున్న రైతులు తమను ఆదుకోవాలని వేడుకొంటున్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరుతున్నారు.



వెల్దుర్తిలో కొనుగోలు కేంద్రంలో పరిస్థితి

అన్నదాత గుండెకోత

- వడగళ్లు, ఈదురుగాలులకు రైతన్న దిగాలు
- పంట చేతికొచ్చే వేళ ప్రకృతి ప్రకోపం
- తడుస్తున్న ధాన్యం.. నేలరాలుతున్న మామిడి
- కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ల కొరత



చౌటకూర్ మండలం శివంపేటలో తడిసిన వడ్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 28: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గత పక్షం రోజులుగా వడగళ్లు, ఈదురుగాలులు వ్యవసాయాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. సాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ అష్టకష్టాలుపడి పంటలను కాపాడుకున్న రైతులకు అకాల వర్షాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. చేతికొచ్చిన పంట వరదపాలవుతుండటంతో బావురుమంటున్నారు.

2,300 ఎకరాల్లో పంట నష్టం

మెదక్ జిల్లాల్లో ఈదురుగాలులు, వడగళ్లకు 1,874 ఎకరాల్లో వరి దెబ్బతిన్నది. కోతకు వచ్చిన పంట నేలరాలే ప్రమాదం నెలకొన్నది. దంతోపాటు 21 ఎకరాల్లో మామిడి తోటలకూ నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో 434 ఎకరాల్లో పంటకు నష్టం కలిగినట్లు అంచనావేశారు. ఇందులో 20 ఎకరాల మామిడితోట కూడా ఉంది. ఈ నివేదికను సంగారెడ్డి, మెదక్ జిల్లాల వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. గతంలోనూ పంట నష్టాన్ని అంచనా వేసినప్పటికీ పరిహారం అందలేదని అప్పటి బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పుడైనా సాధ్యమైనంత త్వరగా పరిహారం దక్కేలా చూడాలని కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై పట్టింపేది?

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పుడిప్పుడే ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనూ వసతుల లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. టార్పాలిన్లు లేక కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతున్నది. గతేడాది కూడా టార్పాలిన్లు లేక రైతులు నష్టపోయారు. అయినా ఈసారి కూడా అధికారులు షరామామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తే తగిన ఫలితం ఉంటుంది.

25 క్వింటాళ్ల ధాన్యం తడిసింది



రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేస్తే 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వడ్లను ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి పంపించడానికి సిద్ధం చేస్తుండగా వర్షం కురిసింది. 25 క్వింటాళ్ల వడ్లు వరదలో కొట్టుకుపోయాయి. అప్పు చేసి పెట్టుబడి పెడితే ఖర్చులు కూడా తిరిగివచ్చేలా లేదు.

-సాదుల భీములు,
కౌలు రైతు, ఇస్లాంపూర్

ఏడుపాయల హుండీ లెక్కింపు..
ఆదాయం రూ.46.08 లక్షలు

పాపన్నపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి హుండీల ద్వారా రూ.46,08,534 ఆదాయం సమకూరింది. సోమవారం ఆలయ ఈవో చంద్రశేఖర్, లెక్కింపు ప్రత్యేకాధికారి సులోచన సమక్షంలో ఆలయ సిబ్బంది, వెంకట అన్నమాచార్య సేవాసమితి సభ్యులు ఆలయ ప్రాంగణంలోని గోకుల్‌షెడ్‌లో హుండీలను లెక్కించారు. భక్తులు సమర్పించి వెండి, బంగారం మినహా 58 రోజుల్లో రూ.46,08,534 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



ఏడుపాయలలో హుండీలో నగదును లెక్కిస్తున్న మహిళలు

ఉమ్మడి జిల్లాలోనే తొలి ఇండోర్ సబ్‌స్టేషన్

- పటాన్‌చెరులో రూ. 12కోట్లతో ఏర్పాటు
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతతో ఉమ్మడి జిల్లాలోనే తొలిసారి పటాన్‌చెరులో నిర్మిస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. రూ. 12 కోట్ల బడ్జెట్‌తో 33/11కేవీ సామర్థ్యంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఈ సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను పరిష్కరించేందుకు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో రూ.100 కోట్లతో 132కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలియజేశారు. ఎంపీడీవో యాదగిరి, ట్రాన్స్‌కో ఏడీఈలు సంజీవ్, నాగరాజు, రవికాంత్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నివార్తి దేవ్, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంజోల్‌లో రైతులను అడిగి సాగు పద్ధతులు తెలుసుకుంటున్న విద్యార్థినులు

సాగుబడి

రైతుతో నడుస్తూ... మెలకువలు నేర్చుకుంటూ

- కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినుల క్షేత్ర సందర్శన
- మూడు నెలలు గ్రామాల్లోనే మకాం
- రైతులతో కలిసి పంటల సాగు
- వారికి మార్గదర్శనం చేస్తూ.. క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనం
- ఉద్యానపంటల శిక్షణకు కేంద్రంగా జహీరాబాద్ డివిజన్

7

తరగతి గదుల్లో సాగు పాఠాలను చదవడం... మట్టిలోకి దిగి పంటను పండించడం రెండింటి మేళవింపుతోనే వ్యవసాయ చదువు పరిపూర్ణమవుతుంది. అందుకే వ్యవసాయ విద్యార్థినులు పంటలపై అధ్యయనం చేసేందుకు, మెలకువలను తెలుసుకునేందుకు, వారు నేర్చుకున్న కొత్త పద్ధతులను రైతులకు వివరించేందుకు క్షేత్రస్థాయిలో సందర్శిస్తుంటారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ వ్యవసాయ యూనివర్సిటీకి చెందిన విద్యార్థినులు తమ శిక్షణలో భాగంగా జహీరాబాద్ ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును అధ్యయనం చేస్తున్నారు. ప్రతీ ఏటా బృందాలుగా వచ్చి సాగు జ్ఞానాన్ని ఒడిసిపడుతున్నారు.

-జహీరాబాద్

ఉన్నతీకరణ సరే..
వేతనాల సంగతేంది?

- ఉన్నతీకరించిన అంగన్‌వాడీల్లో టీచర్లకు ఏడాదిగా పాత జీతాలే
- ఏడాదిగా పెంచిన వేతనాలు ఇవ్వని సర్కారు
- మెదక్ జిల్లాల్లో 191 మంది టీచర్ల ఎదురుచూపులు



మెదక్ అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీల నుంచి అంగన్‌వాడీలుగా గుర్తింపుపొందినా టీచర్లకు పాత జీతాలే మంజూరుకావడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జనవరిలో మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. వాటిలో పనిచేసే టీచర్లకు తొలుత మూడు నెలలు ప్రధాన అంగన్‌వాడీల టీచర్లతో సమానంగా వేతనాలు పెంచి ఇచ్చింది. మూడు నెలల తరువాత మళ్లీ మినీ అంగన్‌వాడీల జీతాలనే ప్రస్తుతం ఇస్తోంది.

పేరుకే అప్‌గ్రేడ్..

మెదక్ జిల్లావ్యాప్తంగా 1,076 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. జిల్లాలో 191 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం 2024 జనవరిలో ఉత్తర్వులను జారీచేసింది. కానీ, ఆర్థికశాఖ ఆమోదం లభించకపోవడంతో అప్‌గ్రేడ్ చేయబడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పాత జీతమే అందుతోంది. మినీ అంగన్‌వాడీలకు నెలకు రూ.7,500 చొప్పున వేతనం లభించేది. ఉన్నతీకరణ చేయడంతో ప్రతి నెలా రూ.15 వేల జీతం అందాల్సి ఉంది. అప్‌గ్రేడ్ చేసిన తొలినాళ్లలో మూడు నెలలు వేతనం పెంచి ఇచ్చారు. ఆర్థిక శాఖ ఆమోదం లభించకపోవడంతో 2024 ఏప్రిల్ నుంచి మళ్లీ పాత వేతనాలనే ఇస్తున్నది. ఒకేవిధమైన పనికి వేర్వేరు జీతాలపై టీచర్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్త్రీశిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులకు, ఆర్థికశాఖకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం కనిపించడం లేదని టీచర్లు వాపోతున్నారు. తమ శాఖ విధులే కాకుండా ప్రభుత్వం సూచించిన ఎలాంటి పనినైనా బాధ్యతతో చేస్తున్న తమ పట్ల కనికరం చూపడం లేదని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కార్ స్పందించి కొత్త వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

అప్‌గ్రేడ్ చేయబడిన మినీ అంగన్‌వాడీ టీచర్లకు కొత్త వేతనాలు చెల్లించాలని ఎన్నోమార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు. టీచర్లపై చిన్నచూపు చూస్తున్నారు. అదనపు పనులన్నీ చేయిస్తున్నారు. వేతనాలు మాత్రం తక్కువగా ఇస్తున్నారు. వెంటనే సర్కార్ స్పందించి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లతో సమానమైన వేతనం మినీ టీచర్లకు చెల్లించాలి.

-నర్సమ్మ, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

ప్రత్యేక బడ్జెట్‌తో వేతనాలు

మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. వేతనాల సమస్యపై ఇటీవల సమావేశం నిర్వహించాం. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి మెయిన్ టీచర్లతో సమానమైన జీతాలు అందజేస్తాము. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-హైమావతి, డీడబ్ల్యూవో మెదక్

పొదుపు సంఘానికి రాష్ట్రస్థాయి అవార్డు

గుమ్మడిదల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి(వీరన్నగూడెం) శాలిని మహిళా పొదుపు సంఘ సభ్యులు తయారు చేస్తున్న లక్క బొమ్మల తయారీ నైపుణ్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి అవార్డును అందజేసింది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పొదుపు సంఘం బాధ్యురాలు ఎస్‌కె.లాయకకు సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేశారు.



సంఘం బాధ్యురాలు ఎస్‌కె.లాయకకు అవార్డును అందజేస్తున్న మంత్రి సీతక్క

పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?

మీ కుటుంబ సభ్యులలో మీ బంధుమిత్రులలో మీ సహోద్యోగులలో ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా..? అయితే వారికి, తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి ఆత్మీయ శుభాకాంక్షలు



ఆంధ్రజ్యోతి

అందిస్తోంది సులువైన మార్గం ఉద్యోగవిరమణ ప్రకటనలకు

25% సిటీ /జిల్లా ప్రకటనకు డిస్కౌంట్

15% జోన్ ప్రకటనకు డిస్కౌంట్

ప్రతి ప్రకటనపై GST 5% వర్తిస్తుంది.

సంగారెడ్డి / పటాన్‌చెరు :99516 09964
నారాయణఖేడ్ / జహీరాబాద్ :97030 18478
మెదక్ /నర్సాపూర్ :97030 18476
సిద్దిపేట /గజ్వేల్ :99485 05054

వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం

● ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం

వెల్దుర్తి/చేగుంట/చిన్నశంకరంపేట/తొగుట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో సోమవారం చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఉరేసుకుని బలవన్మరణం చెందగా, మరో వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నలుగురి మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి.

● వెల్దుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి పట్టణానికి చెందిన ముల్క శేఖులు(55) వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం వెల్దుర్తి పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన శేఖులును స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులున్నారు.


ముల్క శేఖులు(ఫైల్)


వడ్డే హరి (ఫైల్)


లింగాపురం సురేష్ (ఫైల్)


చిలివేరి నరేష్‌గౌడ్ (ఫైల్)

● చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం కన్నారం గ్రామానికి చెందిన వడ్డే హరి(21) ఆదివారం రాత్రి మిత్రులతో కలిసి గడిపాడు. మరునాడు తెల్లవారు జామున గ్రామంలోని హై టెన్షన్ స్తంభానికి ఉరేసుకుని వేలాడుతున్న హరి మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు సమాచారమందించారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ వెల్లడించారు. కాగా కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నట్టు తండ్రి రాములు తెలిపారు.

● చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లిలో ఓ వ్యక్తి అప్పుల బాధ భరించలేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గవ్వలపల్లి గ్రామానికి చెందిన లింగాపురం సురేష్ (30) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు తన పొలాన్ని అమ్మాలని నిర్ణయించుకున్నాడు. అయితే పొలాన్ని కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సురేష్ గ్రామ శివారులో ఉన్న చెరువులో దూకి మృతి చెందాడు. మృతుడికి భార్య శ్రీజన్య, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● సిద్దిపేట జిల్లాలోని తొగుట మండలకేంద్రంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట గ్రామానికి చెందిన చిలివేరి నరేష్‌గౌడ్ (30) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటుండేవాడు. అతడికి తల్లి, తండ్రులు లక్ష్మి, వెంకట్‌గౌడ్‌తో పాటు ముగ్గురు తోబుట్టువులు ఉన్నారు. ఇటీవల తల్లితండ్రులు అనారోగ్య సమస్యలతో బాధ పడుతుండగా వైద్యం కోసం నరేష్‌గౌడ్ అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల్య వివాహం చేసేందుకు యత్నించిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలోని జమ్లా నాయక్ తండాకు చెందిన తల్లిదండ్రులు తమ కూతురికి బాల్య వివాహం జరిపించేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ జిల్లా అధికారులు నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ సోమవారం బాలిక తల్లిదండ్రులను కలిసి బాల్యవివాహంతో ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ అధికారుల వెంట పంచాయతీ కార్యదర్శి ఎండీపాషా, హెచ్‌ఎం. శివకుమార్, అంగన్‌వాడీ టీచర్ పార్వతి, గ్రామస్థులు, తండావాసులు ఉన్నారు.


జమ్లా నాయక్ తండాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మెదక్ జిల్లా ఐసీడీఎస్ అధికారులు

చెరువులో పడి యువకుడు మృతి

చేగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిన యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బోనాల్ కొండాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బుర్కా హర్షవర్ధన్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. వారి బంధువు దశదినకర్మ రోజు గ్రామ సమీపంలోని పెద్ద చెరువులోస్నానాలకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి నీట మునిగిపోవడంతో, అక్కడున్నవారు గమనించి బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న హర్షవర్ధన్‌ను నార్సింగి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు.


హర్షవర్ధన్ (ఫైల్)

అనుమతుల్లేని ఇసుక టిప్పర్ సీజ్

మునిపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను సోమవారం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో ఇసుక రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారమందడంతో మునిపల్లి కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి బీదర్‌లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు టిప్పర్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు డ్రైవర్ ఎండీ ఖలీద్, టిప్పర్ యజమాని ఎండీ జిషాన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

● హైద్లాపూర్‌లో ఒక ఇల్లు, 3రేకుల షెడ్లు కూల్చివేత


హైద్లాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఇంటి పునాదులను ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేయిస్తున్న అధికారులు

మునిపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గంగాభవాని హెచ్చరించారు. మండలంలోని హైద్లాపూర్ గ్రామంలోని 52వ సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు, షెడ్లు ఏర్పాటు చేయడంతో వారికి గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణాలు నిలిపివేయకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ గంగాభవాని, ఆర్‌ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఇతర అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించారు. ఈ సందర్భంగా పిల్లర్ల స్థాయిలో ఉన్న ఒక ఇల్లును, మూడు రేకుల షెడ్లను నేలమట్టం చేశారు. తాము నిర్మించుకున్న నివాసాలను కూల్చివేయడంపై వారు అడ్డుకున్నప్పటికీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని గతంలోనే పంచాయతీ అధికారులతో నోటీసులు జారీ చేశామని, అయినా పనులు ఆపకపోవడంతో నిర్మాణాలను తొలగించామన్నారు.


మహిళ మృతికి కారణమైన డ్రైవర్‌ను అరెస్టు చేయాలి

● పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ధర్నా



హత్నూర పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబీకులు, బంధువులు

హత్నూర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు హత్నూర పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం ధర్నాకు దిగారు. ఆదివారం సాయంత్రం హత్నూర దౌల్తాబాద్ రోడ్డుపై దేవులపల్లి గ్రామ శివారులో మద్యం మత్తులో కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న అమృత (45) మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం మృతురాలి కుటుంబీకులు, బంధువులు హత్నూర పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. మహిళ మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయడంతో పాటు మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, లేదా తమ ఆందోళన విరమించేది లేదని భైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ నయిమొద్దీన్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమనిగింది.











మృతుడి కుటుంబానికి నీలం మధు ఆర్థిక సాయం



సారయ్య కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న నాయకులు

కోహెడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి కాంగ్రెస్ నేత నీలం మధు ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు హాజరై తిరిగి వస్తూ అజాగ్రతతో వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనగా ఇద్దరు మృతిచెందిన సంఘటన విదితమే. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బండోజు గణేషచారి, తాడెం సారయ్య ముదిరాజ్ దుర్మరణం పాలయ్యారు. తాడెం సారయ్యకు భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి నీలం మధు తక్షణ సహాయం కింద రూ.50 వేలను ప్రకటించగా, కాంగ్రెస్ కోహెడ మండలం అధ్యక్షుడు మంద ధర్మయ్య తదితరులు సోమవారం అందజేశారు. ఈ ప్రమాదం విషయంలో బీఆర్ఎస్ పార్టీ సైతం మానవతా దృక్పథంతో ఆలోచించి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని నీలం మధు డిమాండ్ చేశారు.

బీవీఆర్ఐటీని సందర్శించిన కెనడా ప్రొఫెసర్



విద్యార్థుల్లో కెనడా ప్రొఫెసర్ కెన్నెత్ బి.కెంట్

నర్సాపూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీని కెనడా దేశానికి చెందిన ప్రముఖ యూనివర్సిటీ ప్రొఫెసర్ కెన్నెత్ బి.కెంట్ సోమవారం సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ఆపరేటింగ్ సిస్టమ్‌లో గార్బేజ్ కలెక్టర్ స్వయంచాలకంగా మెమరీ అకేషన్, డీ అలోకేషన్ ఎలా నిర్వహిస్తుందో వివరించారు. అదేవిధంగా జావా, సి ప్లస్‌ప్లస్ వంటి ప్రోగ్రామింగ్ భాషలు ఎలా నిర్వహిస్తారో విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ సతీష్‌చంద్ర, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ టీపీవో బంగర్రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

'ఏలేటి'కి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏలేటి రాజశేఖర్‌రెడ్డి

రామాయంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రక్త, అవయవ దానాల విస్తృత ప్రచారం సాగించిన ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి లయన్స్ అంతర్జాతీయ అవార్డు దక్కింది. ఆదివారం రాత్రి శామీర్‌పేటలోని పుష్ప కన్వెన్షన్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు అవార్డు బహూకరించారు. రాజశేఖర్‌రెడ్డి 35 ఏళ్లుగా రామాయంపేట లయన్స్ క్లబ్‌లో పని చేస్తూ.. ప్రస్తుతం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా సేవ కార్యక్రమాల్లో ముందున్నారు.

యోగా గురువు తోట సతీష్‌కు సన్మానం



జ్ఞాపికను అందుకుంటున్న తోట సతీష్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటకు చెందిన తెలంగాణ రాష్ట్ర యోగ అధ్యయన పరిషత్తు సభ్యుడు, రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, ప్రముఖ యోగా గురువు తోట సతీష్‌ను ఏసియన్ యోగాసన పోటీ నిర్వాహకులు సన్మానించారు. న్యూఢిల్లీలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఏసియన్ యోగాసన పోటీల్లో ఆయన జడ్జిగా వ్యవహరించారు. 21 దేశాలకు చెందిన యోగ సాధకులు పోటీల్లో పాల్గొనగా, ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో కేంద్ర మంత్రి హర్ష మల్హోత్రా, అంతర్జాతీయ యోగాసన అధ్యక్షుడు డాక్టర్ జయదీప్ ఆర్య తదితరులు సతీష్‌కు జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

బీరంగూడ మల్లికార్జునస్వామి ఆలయ భూములను రక్షించాలి

● తహసీల్దార్‌కు విన్నవించిన అఖిలపక్ష నాయకులు

అమీన్‌పూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : బీరంగూడ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయం భూమలును కబ్జాల చెర నుంచి కాపాడాలని అఖిలపక్ష నాయకులు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి విలువైన ఆలయ దేవుడి మాన్యం భూముల్లో కబ్జాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 993లో ఆలయ భూమి ఉండగా, హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేసినప్పటికే, కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గతంలో అనేకమార్లు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల రమేష్, ఆదెళ్ల రవీందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ నందారంనర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీరంగూడ అఖిలపక్ష నాయకులు



రంజోల్‌లో పొలాల్లో పనులు చేస్తున్న విద్యార్థినులు

సాగుబడి

రైతుతో నడుస్తూ... మెలకువలు నేర్చుకుంటూ

ఉద్యాన కళాశాల విద్యార్థినుల క్షేత్ర సందర్శన

మూడు నెలలు పాటు గ్రామాల్లోనే మకాం

రైతులతో మమేకమవుతూ సాగుపై అధ్యయనం

ఉద్యాన పంటల శిక్షణకు కేంద్రంగా జహీరాబాద్ డివిజన్

జహీరాబాద్, ఏప్రిల్ 28 : గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఉద్యాన పంటల సాగు తీరు అనుభవపూర్వక శిక్షణలో భాగంగా విద్యార్థినులు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శిస్తారు. ఉద్యానశాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు విద్యార్థులను రైతుల వద్దకు తీసుకెళుతుంటారు. దీంతో వారు పంటల సాగు విధానాన్ని నేర్చుకుని పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. రెండేళ్లుగా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులను అధ్యాపకులు జహీరాబాద్ ప్రాంతానికి పంపిస్తున్నారు. ఇప్పటివరకు 200 మంది విద్యార్థులు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

నాలుగు బృందాలు

ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సుమారు 40 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. 10 మంది చొప్పున నాలుగు బృందాలు ఒక్కో ప్రాంతానికి వెళ్లి రైతులు పాటిస్తున్న యజమాన్య పద్ధతులను తెలుసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో జనవరి మధ్య నుంచి ఏప్రిల్ వరకు దాదాపు మూడు నెలల పాటు గ్రామాల్లోనే ఉంటారు. రైతుల సాగు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి అవగతం చేసుకుంటారు. విత్తనాలు నాటే దగ్గర నుంచి రైతు వెన్నంటి ఉండి నేర్చుకుంటారు. సేంద్రియ ఎరువుల వాడకం, పంటలపై రసాయనాలను పిచికారీ చేసే విధానం, ఏయే సమయాల్లో కలుపు తీయాలి, పంట చేతికి ఎప్పుడు వస్తుందని తదితర వివరాలను రైతులతో ద్వారా నేర్చుకుంటారు. జహీరాబాద్ ప్రాంతంలోని చిన్నహైదరాబాద్, రంజోల్, బాబానగర్, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో రైతుల వద్ద అనుభవాలను నేర్చుకుంటున్నారు. ఆయా గ్రామాల్లోనే నివాసం ఉంటూ రైతులతో మమేకమవుతున్నారు. అంతేకాకుండా తరగతి గదుల్లో విద్యార్థులు నేర్చుకున్న నూతన పద్ధతులను, అధిక దిగుబడులుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు విద్యార్థినులకు, రైతులకు పరస్పర ప్రయోజనకారిగా ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

విద్యార్థులకు సలహాలిస్తున్నాం



శిక్షణార్థం వచ్చిన విదార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. విద్యార్థుల ద్వారా కొత్త పద్ధతులను నేర్చుకుంటున్నాం. జహీరాబాద్ ప్రాంతంలో ఉద్యాన పంటలను ఎక్కువగా సాగుచేయడం వల్లే విద్యార్థులను ఆయా కళాశాలల యాజామాన్యాలు క్షేత్రస్థాయిలో అధ్యయనం నిమిత్తం ఇక్కడికి పంపిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 200 మంది విద్యార్థులకు శిక్షణను ఇవ్వడమైంది.

-ప్రదీప్, వ్యవసాయ విస్తీర్ణాధికారి, జహీరాబాద్

జహీరాబాద్ డివిజన్‌లో అధిక విస్తీర్ణంలో ఉద్యాన పంటలు

జహీరాబాద్ డివిజన్‌లో ఉద్యాన పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంటాయి. మారుతున్న కాలానుగుణంగా, మార్కెటింగ్ పరిస్థితుల దృష్ట్యా పండ్ల తోటలు, కూరగాయల సాగుపై ఇక్కడి రైతులు ఆసక్తిని చూపిస్తున్నారు. డివిజన్‌లోని కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో 20 వేల పైచిలుకు ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. అందులో సుమారు 13 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, ఏడు వేలపైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. రంజోల్, హుగ్గెల్లి, చిన్నహైదరాబాద్, హోతి(బి), కాశీంపూర్, రాయిపల్లి తాండ, మొగుడంపల్లి, ధనసిరి, గోపన్‌పల్లి, పర్వతాపూర్, కవేలి, మాచిరెడ్డిపల్లి, సజ్జాపూర్, పిచేర్యాగడి, మనియార్‌పల్లి, ఈదులపల్లి, తదితర గ్రామాల వ్యసాయ భూములు ఉద్యాన పంటల సాగుకు యోగ్యమైనవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇక్కడ అల్లం, అరటి, బొప్పాయి, మామిడి, జామ, సపోట, యాపిల్, ఉల్లిగడ్డ, కొత్తరకాలు జెరీసీయం, అంజీర్, సబ్జ, డ్రాగన్‌ఫ్రూట్ తదితరాలు కూడా సాగవుతున్నాయి. ఇక్కడి రైతులు ఉద్యాన పంటల్లో రాణిస్తుండడంతో విద్యార్థినుల శిక్షణకు జహీరాబాద్ ప్రాంతం కేంద్రంగా మారింది.

క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన



కళాశాలల్లో నేర్చుకున్న దాని కంటే క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా వ్యవసాయం అంటే పూర్తిగా అవగతమవుతుంది. పంటల సాగు, దిగుబడి, సస్యరక్షణ విధానం, రైతులతో అనుభవాలను పంచుకుంటున్నాం. స్థానికంగా ఉన్న వ్యవసాయ భూములన్ని ఉద్యాన పంటలకు అనుకూలమైనవి కావడంతో బోధనకు మరింత ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సహకారంతో రైతుల వెంట పొలాలకు వెళ్లి సాగు తీరును పరిశీలిస్తున్నాం.

- మహాలక్ష్మి, అనాజ్‌పూర్

రైతులతో కలిసి నేర్చుకోవడం సంతృప్తిగా ఉంది



రైతులతో కలిసి వారివెంట పొలాలకు వెళ్ళి నేర్చుకోవడం సంతృప్తినిస్తుంది. రైతులే రోజుకోతరహా శాస్త్రవేత్తలని ఆమె అభివర్ణించారు. వారి వద్ద అపారమైన అనుభవాలను ఒంటబట్టించుకుని మరింత నేర్చుకుంటున్నాం. క్షేత్రస్థాయి సందర్శన వచ్చిన తమకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా మారి మంచి సత్ఫలితాలనిస్తుందన్నారు. పండ్లతోటలకు జహీరాబాద్ నియోజకవర్గం ఎంతగానో ప్రసిద్ధి చెందుతుందని, మున్ముందు ఈ ప్రాంతంలో ఉద్యానవ పంటలు రెట్టింపు స్థాయిలో సాగయ్యే అవకాశం ఉంది.

- ఎల్ల వర్ష, బికనూర్

విలీన గ్రామాల కార్యదర్శులకు విధులేవి?

● త్రిశంకు స్వర్గంలో 25 మంది పంచాయతీ సెక్రెటరీలు

● మున్సిపల్‌లో విలీనం చేయడం లేదు.. వెనక్కి పంపడం లేదు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో పలు పంచాయతీలు విలీనం అయ్యాయి. అప్పటికే గ్రామాల్లో పని చేస్తున్న కార్యదర్శులను విలీనం చేయకుండా త్రిశంకుస్వర్గంలో ఉంచారు. ఎటువంటి పనులు లేకుండా వచ్చామా వెళ్లామా అన్నట్టుగా వారి విధులు తయారయ్యాయి.

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇస్నాపూర్, గుమ్మడిదల, గడ్డపోతారం, కోహీర్ గ్రామపంచాయతీలను నూతన మున్సిపాలిటీలుగా ఏర్పాటు కాగా, గతంలోనే ఏర్పాటైన అమీన్‌పూర్, తెల్లాపూర్ బల్దియాల్లో 11 గ్రామాలు విలీనం చేశారు. ఇంద్రేశం, భానూరు, జిన్నారం కేంద్రాలుగా మరో మూడు పురపాలికలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీల్లో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులుగా పని చేసిన వారిని విలీనం చేయడానికి వీలుగా పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఇటీవల పంచాయతీరాజ్ ప్రధాన కార్యాలయం నుంచి వర్తమానం వచ్చిందంటూ కార్యదర్శులను మాత్రమే విలీనం చేసుకోండి క్యాడర్‌ను కాదంటూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఫలితంగా మున్సిపాలిటీలోకి వెళితే జీవితం కాలం పాటు పట్టణాల్లో ఉద్యోగం చేయడమే కాకుండా క్యాడర్‌కు తగ్గట్టుగా గౌరవం దక్కుతుందనుకున్న వారి ఆశలపై ఒక్కసారిగా నీళ్లు చల్లినట్లయింది. ఎటు వెళ్లాలో పాలుపోక 25 మంది కార్యదర్శులు అలానే ఉండిపోయారు.

గ్రేడ్‌ల వారీగా పోస్టులు దక్కేనా?

మూడు రకాల గ్రేడ్‌ల వారు పంచాయతీల్లో పని చేస్తున్నారు. ఒకటో గ్రేడ్‌కు చెందిన వారికి మున్సిపాలిటీల్లో రెవెన్యూ అధికారిగా, మేనేజర్లుగా నియమించుకునే సౌలభ్యం ఉంటుంది. అలానే గ్రేడ్-3 జూనియర్ సహాయకులుగా, గ్రేడ్-4 బిల్‌కలెక్టర్, వార్డు ఆఫీసర్‌లుగా వినియోగించుకుంటారు. గ్రామాల్లో అన్ని రకాల అనుమతులకు సంతకాలు పెట్టిన కార్యదర్శులను సంతకానికి విలువలేని పోస్టుల్లో వాడుకుంటున్నారు. వేతనం జిల్లా పంచాయతీ కార్యాలయం వారు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలో మున్సిపల్ అధికారులు వాడుతున్నారు.





శమ్నాపూర్‌లో ఆమ్‌చూర్ తయారు చేస్తున్న కూలీలు

ఆమ్‌చూర్‌తో ఉపాధి బాట

వేసవిలో రెండు నెలలు చేతినిండా పని

ఆర్థికంగా లబ్ధిపొందుతున్న పల్లె ప్రజలు

హవేళిఘణపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌చూర్ తయారీతో పల్లెల్లో కూలీలు ఉపాధి పొందుతున్నారు. మండలంలోని శమ్నాపూర్, గంగాపూర్, గ్రామాల్లో పెద్దఎత్తున మామిడి టంకర (ఆమ్‌చూర్) తయారు చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్లలేక నీడ పట్టున టంకర తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మహిళలు, పురుషులు గ్రూపులుగా ఏర్పడి ఆమ్‌చూర్ తయారు చేస్తారు. పగలంతా పురుషులు వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేసి తీసుకువస్తారు. మహిళలు చెట్ల నీడలో, పందిళ్లు వేసుకుని మామిడి కాయలపై పొరను తొలగించి ముక్కలుగా కోసి ఎండబెడతారు. ఇందుకు మహిళలకు గంపకు రూ.150 వరకు చెల్లిస్తారు. ఒక మహిళ రోజులో 4-5 గంపల వరకు టంకర తయారు చేస్తారు. ఎండిన ఆమ్‌చూర్‌ను హైదరాబాద్, నిజమాబాద్ నగరాల్లో మార్కెట్లలో విక్రయిస్తారు. క్వింటాలుకు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు ధర పలుకుతుందని పేర్కొంటున్నారు. వేసవి రెండు నెలల్లో రూ. 40 వేల ఆదాయం వస్తుందని శమ్నాపూర్‌కు చెందిన రాజు పేర్కొన్నారు.



ఎండలో ఆరబెట్టిన మామిడి టంకర

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

● పహల్గాంలో ఘటనలో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు

● రాష్ట్ర పర్యావరణ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

హత్నూర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో దాడులకు పాల్పడుతూ అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపిన ఉగ్రవాదులను అణచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్ గ్రామ శివారులోని ఎస్ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందినవారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రపంచ దేశాల శాంతిని కోరుకునే భారత్‌పై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు.



హత్నూర తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు

కరోనా సమయంలో ప్రపంచ దేశాల ప్రజల ఆరోగ్యాన్ని కాంక్షించి తెలంగాణ రాష్ట్రం నుంచి కరోనా నివారణ వ్యాక్సిన్‌ను సరఫరా చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో తయారవుతున్న యుద్ధక్షిపణులను దేశ సరిహద్దుల్లో వినియోగించి ఉగ్రవాదాన్ని అంతమొందించాలని ఆమె కోరారు. ఉగ్రవాదాన్ని అణచివేసి దేశంలో శాంతి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఓవైపు దేశ సరిహద్దుల్లో పెట్రేగిపోతున్న ఉగ్రవాదుల దాడిలో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే కనీసం సానుభూతి తెలుపకుండా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలు జరుపుకోవడం విచారకరమన్నారు. పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అధ్వాన స్థితికి తీసుకెళ్లిన కేసీఆర్ ఇందిరమ్మ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హత్నూరలో తహసీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ క్రాంతి తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ మాధురి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్, టీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి : ఎంపీ రఘునందన్

అవసరమైతే చట్టంలో సవరణలు చేసైనా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. నూతన చట్టంపై అధికారులు పూర్తిస్థాయి అవగాహన పొంది ప్రతీ రైతుకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలన్నారు. దేశంలోని కోర్టుల్లో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉంటే అందులో 3 కోట్ల కేసులు భూ సమస్యలే ఉన్నాయని ఎంపీ వివరించారు. క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

న్యూస్ బాక్స్

మూతపడిన బార్‌కు 20 దరఖాస్తులు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలో గత మూడేళ్లుగా మూతపడిన బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు 20 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా కేటాయిస్తామని జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కళాశాలలో వేసవి తరగతులు

జిన్నారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయి, సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మే 2 నుంచి 14వ తేదీవరకు ఆయా సబ్జెక్టులలో లెక్చరర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారన్నారు.

ఈనెల 12 వరకు ఇంటర్ దరఖాస్తుల గడువు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం మే 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీవో గౌతంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని, ఎలాంటి ఎంట్రెన్స్ లేదని స్పష్టం చేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, అగ్రికల్చర్ తదితర కోర్సులున్నాయన్నారు.

30న బసవ జయంతి

నారాయణఖేడ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న బసవ జయంతిని పురస్కరించుకుని నారాయణఖేడ్‌లోని బసవ మండపంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వీర శైవ లింగాయత్, లింగబలిజ, జంగమ సమాజం వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఖేడ్‌లోని బసవ మండపంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు మెగా రక్తదాన శిబిరంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సాయంత్రం వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

వెల్దుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి మండల కేంద్రం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్దుర్తి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండల్‌రావు సోమవారం మేడ్చల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మేనేజర్ మూడురోజుల్లో బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీఇచ్చారు.

శిక్షణా శిబిరం ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలు, భగవద్గీత శ్లోకాలు, నీతి పద్యాలు, యోగా, కరాటే, చిత్రలేఖనం, యోగచాప్, కోలాటం, సంగీతం తదితర విషయాలను నేర్పాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని పాఠశాల అధ్యక్షుడు నారాయణ, పుస్తకార్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రధానాచార్యులు భూమయ్య ప్రారంభించారు.

PUBLIC NOTICE

The General Public is hereby inform that **Smt.Golla Narsamma, W/o.Tukaram,** Aged about 54 Years R/o.H.No: 1-19, Sangam (Khurd) Village, Jharasangam Mandal, Sanga Reddy District, Telangana State 502246. My Client M/s SHRIRAM FINANCE LTD SANGAREDDY Branch. Sanga Reddy Dist with a Requesting to advance of Loan by Mortgaging her Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY

An open Residential H.No. 1-58/1, Admeasuring Area 132.0 Sq Yards situated at Sangam (Khurd) Village Under G.P Thummalapally, Jharasanagam Mandal, Sangareddy District, Issued By No.B/08/2020/1 G.P Thummalapally, **Bounded by: North:**House of Vittal, **South :** House of P.Narsamma, **East:** House of Sidda Reddy, **West:** P W D Road. Institution if having objections, Claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (3) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/-**Aravind Kulkarani,** Advocate, SANGAREDDY.
Ph. : 8639166516

PUBLIC NOTICE

The General Public is hereby inform that **SMT. BANOTH SRI VIDYA w/o. BANOTH RAMESH** Aged about 32Years R/o.H NO: 6-37/2 ,Village. Podchenpally Thanda, Mandal Papannapet, District, Medak-502125. Telangana State. My Client M/s SHRIRAM FINANCE LTD SANGAREDDY Branch. Sanga Reddy Dist with a Requesting to advance of Loan by Mortgaging her Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All That Rcc Roof Room And Open Place Bearing Gram Panchayat.House No.6-37/2.Rcc Roof Room Built-up area Admeasuring 11.11 Sq Yards Equal To 9.29 Sq. ,Open Place area Admeasuring 122.94 Sq. Yards equal to Thus Total area admeasuring 134.05 Sq. Yards Situated at " PODCHENPALLY THANDA-REVENUE VILLAGE PODCHENPALLY" Mandal: PAPANNAPET, Dist. MEDAK of TELANGANA STATE Regn., Sub District Medak and Registration Sub District Medak of Sangareddyand bounded by: **North:** Agriculture Land of Ravi, **South:** Owners Land Onwards R&B Road, **East:** Open Place of D.Palcira, **West:** House of M Ravi.

Institution if having objections, Claims interest disputed for the .above, intended transaction he / she / they may contact the undersingh with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (3) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained. Open Place of

Sd/- ARAVIND KULKARANI, Advocate,
PH:8639166516, SANGAREDDY-502001

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం: నిర్మలాజగ్గారెడ్డి





బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యాలతో ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పేదలకు సోమవారం సంగారెడ్డిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని సంగారెడ్డి, కంది, కొండాపూర్, సదాశివపేట మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన పలువురికి నిర్మలాజగ్గారెడ్డి చెక్కులు పంపిణీ చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యమందించడమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న అంజయ్య, తదితరులు

రాయికోడ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యమందించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పేర్కొన్నారు. సోమవారం రాయికోడ్ మండల పరిధి సింగితం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం కోసం ప్రత్యేక కృషి చేస్తుందని పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయా గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, నాయకులు బాలాజీనర్సింలు, సిద్ధన్నపటేల్, కేదార్‌నాథ్, సతీష్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దని, త్వరగా పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజలకు మనం జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజావాణికి పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఉపాధి చూపాలని, రైతు రుణ మాఫీ చేయాలని, భూ సమస్యలను పరిష్కరించాలని వివిధ సమస్యలపై మొత్తం 43 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి 58 అర్జీలు వచ్చాయి. ఇందులో భూభారతి 14, ఇందిరమ్మ ఇండ్లు 6, ఉపాధి 4, పెన్షన్ 1, ఇతర సమస్యలపై 33 దరఖాస్తులు వచ్చాయి.



దరఖాస్తులను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు చేయూత



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న సుహాసినిరెడ్డి, రాజిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.6.36 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు మల్లేశంచారి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరం

కంది, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఏఐఎన్‌జీవో (అఖిల భారత నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం) 93వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యబృందం, రెడ్‌క్రాస్ సొసైటీలు సంయుక్తంగా నిర్వహించిన శిబిరాన్ని సీజీఎం ఎస్‌ఎస్.ప్రసాద్ ప్రారంభించారు. దాదాపు 35 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ రక్తదానం చేస్తే ఒకరి ప్రాణాలు నిలబెట్టిన ఘనత దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎన్‌జీవో నాయకులు అజయ్, జయవర్ధన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన



వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

పుల్‌కల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె నాటికి 10వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సోమవారం శిబిరం వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

గుంతలమయం.. పారిశ్రామికవాడదారి



ఛిద్రంగా మారిన ఐడీఏబొల్లారం పరిశ్రమలకు వెళ్లే దారి

ఐడీఏబొల్లారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడ దారి ఛిద్రమై వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పరిశ్రమలకు ముడిసరుకు తీసుకెళ్లే భారీ వాహనాల డ్రైవర్లు సైతం గుంతలమయమైన దారిపై వెళ్తూ నరకం అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి ఛిద్రమైన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

మూలనపడ్డ స్వీపింగ్ యంత్రం

జహీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పలురకాల వాహనాలు మరమ్మతులకు వచ్చి మూలనపడ్డాయి. నిధుల కొరత తదితర సమస్యలతో వాటికి మరమ్మతులు చేయడంలో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్లపైన చెత్తను సిబ్బందితో తొలగింపజేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతుకు నోచుకోని రోడ్లు ఊడ్చే యంత్రం

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20న 'గొంతెండుతోంది' అన్న కథనం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. అదేవిధంగా నాయకులు ఈ విషయాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన గ్రామానికి బోరు మోటార్ మంజూరు చేశారు. సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి, మాజీ ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్ బోరు మోటార్ ఏర్పాటుకు భూమి పూజ చేసి బోరును ప్రారంభించారు.

డీసీఎంలో తరలిస్తున్న కలప స్వాధీనం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ సోమవారం తెలిపారు. టేక్మాల్ మండలం ఎల్లుపేట్ నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో తరలిస్తున్న వాహనాన్ని పెద్దశంకరంపేట శివారులో ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కౌడిపల్లి మండలానికి చెందిన వినోద్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

మిషన్ భగీరథ ద్వారా నిరంతర తాగునీటి సరఫరా

- వేసవి నీటి ఎద్దడిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



తాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేసవి కొనసాగుతున్నందున నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని ముత్తంగి, చిట్కుల్, ఇస్నాపూర్ గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఇబ్బందులు తలెత్తినందున, యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కరించాలన్నారు. రహదారి విస్తరణ నేపథ్యంలో పలుచోట్ల పైపులైన్ల తరలింపు, పగిలిపోవడం, మరమ్మతుల వల్ల నీటి సమస్య తలెత్తుతోందన్నారు. వారాల తరబడి తాగునీరు లేక గ్రామాలు అల్లాడిపోతున్నాయన్నారు. రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో జనాభాకు అనుగుణంగా తాగునీరు సరఫరా జరగడం లేదని చెప్పారు. పంప్‌హౌజ్ సమీపంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, మున్సిపల్ ఏఈ మౌనిక పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి: ఎమ్మెల్యే



వివేకానంద్ దంపతులను సన్మానిస్తున్న సంజీవరెడ్డి

మనూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమేనని, విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సీనియర్ అసిస్టెంట్ దారం వివేకానంద్‌కు సోమవారం మనూరులోని రైతువేదికలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం వివేకానంద దంపతులకు ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి తదితరులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు షాజీలుద్దీన్, హైమద్ హుస్సేన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్‌ప్రభు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పారదర్శకంగా జరగాలి

- నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సోమేశ్వరరావు



అధికారులకు సూచనలిస్తున్న సోమేశ్వరరావు

కొండాపూర్/నారాయణఖేడ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ జాబితాల్లో అర్హులను గుర్తించి నిర్మాణాపు పనులను పారదర్శకంగా జరిపించాలని సంగారెడ్డి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, జిల్లా హార్టికల్చర్ ఏడీఏ సోమేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం అనంతసాగర్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి స్థలాలను పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పక్కా ఇల్లు లేని వారిని గుర్తించి ఇంటి నిర్మాణాపు పనులు మొదలు పెట్టేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఇందిర, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు విధిగా ఇళ్లను నిర్మించుకోవాలని ఖేడ్ రెవెన్యూ డివిజన్ డీపీవో ఎస్సేరు అనిత సూచించారు. సోమవారం ఆమె ఖేడ్ మండల పరిధిలోని నర్సాపూర్‌లో పర్యటించి లబ్ధిదారులు నిర్మించుకునే ఇళ్లకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు.

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి

- తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవ్వాత్ సురేష్

చేగుంట ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తే ఉన్నత పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవ్వాత్ సురేష్ పేర్కొన్నారు. చేగుంట మండల కేంద్రంలో తపస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలు బలోపేతమైనప్పుడే, ఉన్నత పాఠశాలలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ తరగతికి ఉపాధ్యాయుడిని నియమించాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, మధ్యాహ్న భోజన పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా నాయకులు చక్రవర్తి, రాజేశ్వర్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు చేద్దాం



సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం సీఐటీయూ నాయకులు మేడే కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. మేడే స్ఫూర్తితో ఆనాడు 18 గంటల పనిదినాలను 8 గంటలకు సాధించిన చరిత్ర ఎర్రజెండాదని గుర్తుచేశారు. కానీ బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో అన్నిరంగాల కార్మికులు భారీస్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, యూనియన్ కార్యదర్శి భీమ్‌రెడ్డి, నాయకులు శిశ, షఫీ, ప్రేమ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్‌లోని శ్రామిక్‌భవన్‌లో సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

తెల్లాపూర్‌లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 4 నుంచి 7వ తేదీవరకు రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెలిపారు. సోమవారం క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మే 4, 5వ తేదీల్లో తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం వద్ద వాలీబాల్ పోటీలు, 6, 7వ తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.99,999, రెండో బహుమతి రూ.55,555, (కబడ్డీలో మూడో బహుమతి రూ.33,333)లుగా ఉంటాయని చెప్పారు. ఇతర వివరాలకు 9849623792, 9666515155, 9177291188లను సంప్రదించాలన్నారు.

ధాన్యం తీసుకోకుంటే రైస్ మిల్లులు నడపొద్దు

- ధాన్యం కొనుగోలుపై డివిజన్ స్థాయి సమావేశంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం తీసుకోకుంటే రైస్‌మిల్లులు నడపొద్దని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి రైస్‌మిల్లర్లను హెచ్చరించారు. సోమవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు తూకం వేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి లారీ లోడ్ చేసి రైస్ మిల్లుకు తరలించాలన్నారు. లారీలు అందుబాటులో లేకుంటే ట్రాక్టర్లు, డీసీఎంల ద్వారా రవాణా చేస్తే యజమానులకు ప్రతి ఆదివారం అద్దె చెల్లింపులు చేయాలని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను ఆర్డీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు తహసీల్దార్లు జ్ఞానజ్యోతి, విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, శ్రీకాంత్, కరీం, రైస్‌మిల్లర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఐకేపీ ఏపీఎంలు, ఐకేపీ, సొసైటీల సీసీలు, సీఈవోలు, లారీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నిజాంపేట/చిన్నశంకరంపేట/శివ్వంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తేమశాతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీలత, కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని మడూర్, చందంపేట సొసైటీ పరిధిగ్రామాలు మిర్జాపల్లి, కామారం, సూరారం, దరిపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ సందర్శించారు. శివ్వంపేట మండలంలోని చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, ఎదుల్లాపూర్, చండీ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సమితి మెదక్ జిల్లా గౌరవాధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య సందర్శించి, రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి